సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 20 । ఫిబ్రవరి । 2024



పాడి రైతులకు మంచి రోజులు

పాడి రైతులకు జగన్ సర్కార్ అండగా నిలుస్తోంది. అమూల్ ద్వారా అధిక ధర చెల్లిస్తూ ఆర్థిక చేయూత ఇస్తోంది. 8లో



టమాట కిలో రూ.13

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టం రూ.5, సరాసరి రూ.9 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం

36.9°/ 14.2°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి వాతావరణం కొనసాగింది. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

చింతపండు @ రూ.22 వేలు



మార్కెట్‌కు వచ్చిన చింతపండు

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో క్వింటా చింతపండు గరిష్ఠంగా రూ.22 వేలు పలికింది. మార్కెట్‌కు సోమవారం 3 వేల క్వింటాళ్ల సరుకు రాగా, ఈ–నామ్ పద్ధతిలో వేలం వేసినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. అందులో కరిపులి రకం (ప్రథమశ్రేణి) క్వింటా గరిష్ఠంగా రూ.22 వేలు, కనిష్ఠంగా రూ.8,200, సగటున రూ.14 వేల ప్రకారం ధర పలికిందన్నారు. అలాగే ఫ్లవర్ రకం చింతపండు క్వింటా గరిష్ఠంగా రూ.6 వేలు, కనిష్ఠంగా రూ.4,100, సగటున రూ.8 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగినట్లు ఆయన వెల్లడించారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు




హిందూపురం: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు హిందూపురం స్కిల్ హబ్‌లో నూతన కోర్సులు ప్రారంభిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ హరీష్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ (దేశీయ నాన్ వాయిస్), అసోసియేట్ కస్టమర్ కేర్ (వాయిస్, నాన్ వాయిస్) కోర్సులు ప్రారంభిస్తున్నామని, పది, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. కోర్సు కాలం నాలుగు నెలలు ఉంటుందని, శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గలవారు 9966682246 నంబరులో సంప్రదించాలన్నారు.

నేడు 'వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా' నిధుల విడుదల

పుట్టపర్తి అర్బన్: పేద కుటుంబాల్లోని ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక సాయం అందించేందుకు అమలు చేస్తున్న వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా నిధులు మంగళవారం విడుదల చేయనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సాధికారత అధికారి శివరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడపిల్లల వివాహాలకు జగన్ సర్కార్ ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. ఈ క్రమంలో జిల్లాలోని 416 మంది అర్హులైన లబ్ధిదారులకు రూ.3,10,35,000 మంజూరైందని, ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును మంగళవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో కలెక్టర్ అరుణ్‌బాబు, పలువురు ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు అందించనున్నట్లు తెలిపారు.

మార్కెట్‌ను ముంచెత్తుతున్న పట్టుగూళ్లు



మార్కెట్‌కు వచ్చిన బైవోల్టిన్ పట్టుగూళ్లు

హిందూపురం అర్బన్: పట్టుగూళ్లు హిందూపురం మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. కర్ణాటక రాష్ట్రంలోని మార్కెట్లతో పోలిస్తే ధరలు బాగా పలుకుతుండటంతో రైతులు 'పురం' మార్కెట్‌వైపు మొగ్గు చూపుతున్నారు. కర్ణాటక, ఉమ్మడి అనంతపురం జిల్లాల నుంచే కాకుండా కర్నూలు, చిత్తూరు జిల్లాల నుంచి పట్టు గూళ్లు వస్తున్నాయి. సోమవారం 8.5 టన్నులకుపైగా పట్టుగూళ్లు వచ్చాయి. రోజూ సగటున 3 టన్నుల నుంచి 5 టన్నుల వరకూ పట్టుగూళ్లు వస్తున్నాయి. మార్కెట్‌కు వస్తున్న పట్టుగూళ్లలో 60 శాతం గూళ్లు మడకశిర నియోజకవర్గం, కర్ణాటక నుంచి వస్తున్నాయి. సోమవారం కిలో బైవోల్టిన్ గూళ్లు రూ.460 నుంచి రూ.520 వరకూ ధరలు పలికాయి. ఈనెల 9వ తేదీన 3,480 కిలోల పట్టుగూళ్లు మార్కెట్‌కు రాగా గరిష్ఠం రూ.537, కనిష్ఠంగా రూ.265 ప్రకారం ధర పలికాయి. అలాగే 13వ తేదీన 3,133 కిలోల పట్టుగూళ్లు మార్కెట్‌కు రాగా గరిష్ఠం రూ.526, కనిష్ఠంగా రూ.310, 16వ తేదీన 5,803 కిలోల పట్టుగూళ్లు మార్కెట్‌కు రాగా గరిష్ఠం రూ.539, కనిష్ఠంగా రూ.360, 18 వ తేదీన 8,358 కిలోల పట్టుగూళ్లు మార్కెట్‌కు రాగా గరిష్ఠం రూ.512, కనిష్ఠంగా రూ.382 ప్రకారం ధర పలికినట్లు మార్కెట్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మిరెడ్డి తెలిపారు.

జన కెరటం.. నవ చరితం

- 'సిద్ధం' సక్సెస్.. ఫుల్ జోష్
- రాష్ట్ర చరిత్రలో నిలిచేలా రాప్తాడు సభ
- అన్ని వర్గాల్లో తీవ్ర చర్చ
- సామాజిక మాధ్యమాల్లో సీఎం జగన్ పంచుల ట్రెండింగ్
- పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం

రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఓ రాజకీయ పార్టీ నిర్వహించిన సభకు ఆ పార్టీ శ్రేణులే కాదు జనం కూడా పోటెత్తారు. తమ అభిమాన నాయకుడిని చూసేందుకు కెరటంలా తరలివచ్చారు. భగభగ మండే భానుడి ప్రభావం సైతం వారి ముందు చిన్నబోయింది. ఆదివారం రాప్తాడులో కనీవినీ ఎరుగని రీతిలో జరిగిన 'సిద్ధం' సభ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.





ఆదివారం రాప్తాడులో నిర్వహించిన 'సిద్ధం' సభలో ఫ్యాన్ గుర్తుతో ఏర్పాటు చేసిన కటౌట్ వద్ద ఫ్యాన్స్ హోరు, సిద్ధం సభకు హాజరైన అశేష జనవాహిని

సాక్షి ప్రతినిధి, అనంతపురం: తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటి వరకూ జరగని అతి పెద్ద ప్రజాసభకు వేదికై అనంతపురం జిల్లా తనకంటూ చరిత్రలో ఓ పేజీ లిఖించుకుంది. గతంలో ఎందరో మహామహులు సభలు నిర్వహించినా ఇంత పెద్ద ఎత్తున జనం తరలివచ్చిన సందర్భాలు లేవు. భవిష్యత్తులో ఇంతకంటే పెద్ద సభ జరగడం కూడా కష్టమేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మండే ఎండను సైతం లెక్కచేయకుండా లక్షలాది మంది సభకు హాజరవడం ఆశ్చర్యపరిచిందంటున్నారు. ఇసుకేస్తే రాలనంత జనవాహినితో జిల్లాలో ఉన్న రహదారులన్నీ ఒక్కసారిగా ఊపిరి బిగపట్టినంత పనయిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఏ నాయకుడికీ లేని జనాదరణ జగన్‌మోహన్‌రెడ్డికి ఉందని తెలుసు గానీ, ఆయన హాజరైన సభకు ఈ స్థాయిలో ప్రజలు హాజరవడం ఊహించలేదంటున్నారు. రాప్తాడు 'సిద్ధం' సృష్టించిన రికార్డు చెరిగిపోని, మాసిపోనిదని వ్యాఖ్యానిస్తున్నారు.

సీఎం పంచుల హల్‌చల్

సార్వత్రిక సమరానికి తెరతీసి ప్రతిపక్షాలకు వణుకు పుట్టించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదివారం రాప్తాడులో జరిగిన సిద్ధం సభలో ప్రతిపక్షాలపై పంచులతో హోరెత్తించారు. సాయంత్రం సభ ముగినప్పటి నుంచి సామాజిక మాధ్యమాల్లో సీఎం జగన్ ప్రసంగాలతో పాటు జనం కేరింతలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. లక్షలాది మంది హాజరైన ఫొటోలను అన్ని మాధ్యమాల్లోనూ లక్షల మంది వీక్షించారు. మహిళలు జెండా పట్టుకుని డ్యాన్సులు వేయడం, కుర్రాళ్ల చిందులు వంటివి విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ముఖ్యమంత్రి జగన్ ప్రసంగంలో పేల్చిన పంచులను నెటిజన్లు పదే పదే వైరల్ చేస్తున్నారు. ముఖ్యంగా 'ఫ్యాన్ ఇంట్లో ఉండాలి.. సైకిల్ బయట ఉండాలి..టీ గ్లాసు సింకులోనే ఉండాలి' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఏ మాధ్యమంలో చూసినా వినిపిస్తున్నాయి.

మేమిక సిద్ధం

సాక్షి, పుట్టపర్తి: సార్వత్రిక ఎన్నికల సమరశంఖారావంలో భాగంగా ఆదివారం సీఎం వైఎస్ జగన్ రాప్తాడులో నిర్వహించిన 'సిద్ధం' సభ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. రాయలసీమ వ్యాప్తంగా 52 నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు తరలిరాగా, ఆ ప్రాంతం జన సునామీని తలపించింది. దీంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. ఎన్నికలు ఎప్పుడొచ్చినా 'మేం సిద్ధం' అంటూ కార్యకర్తలు సంబరాల్లో మునిగిపోయారు.

ఆందోళనలో తమ్ముళ్లు

రాప్తాడులో జగన్ ప్రభంజనాన్ని చూసిన తెలుగు 'తమ్ముళ్లు' చిన్నబోయారు. దశాబ్దాల పాటు రాజకీయాలను శాసించిన కుటుంబాలూ ఆలోచనలో పడ్డాయి. టీడీపీ కంచుకోటలుగా పేరుగాంచిన నియోజకవర్గాల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా రెపరెపలాడటం ఖాయంగా కనిపిస్తోంది. దీంతో రానున్న ఎన్నికలను తలచుకుని తెలుగు తమ్ముళ్లు ఇప్పటి నుంచే ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో ఉనికి కోల్పోయిన టీడీపీ

హిందూపురం పార్లమెంటు వ్యాప్తంగా టీడీపీ ఉనికి ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. గతంలో ఏకపక్ష విజయాలు సాధించిన చరిత్ర ఉన్న టీడీపీకి...ప్రస్తుతం ఏ ఒక్క మండలంలో కూడా ప్రాతినిథ్యం లేదు. జిల్లాలో 32 మండలాలు, ఆరు మున్సిపాలిటీలు ఉండగా, ఒక్క చోటా టీడీపీ అధికారం చేపట్టలేదు. అన్ని మండలాలు, ఆరు మున్సిపాలిటీల్లో వైఎస్సార్‌సీపీ సభ్యులే అధికారం కైవసం చేసుకున్నారు. దీంతో 'పురం' పార్లమెంటు పరిధిలో 'సైకిల్' పంక్చర్ అయిందంటూ సామాజిక మాధ్యమాల్లో సెటైర్లు వేస్తున్నారు.

కంచుకోటలకు బీటలు

హిందూపురం, పుట్టపర్తి, రాప్తాడు, పెనుకొండ, ధర్మవరం నియోజకవర్గాల్లో గతంలో టీడీపీ బలంగా ఉండేది. ఎన్టీ రామారావు హయాంలో టీడీపీ కంచుకోటలుగా పిలిచేవారు. అనంతరం కూడా ఒకట్రెండు సార్లు టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. అయితే గత 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఫ్యాన్ తుపాన్‌కు 'సైకిల్' పంక్చర్ అయింది. జిల్లాలో కేవలం హిందూపురంలో మాత్రమే అరకొర మెజారిటీతో నందమూరి బాలకృష్ణ గట్టెక్కారు. మిగతా ఆరు స్థానాల్లోనూ వైఎస్సార్ సీపీ అభ్యర్థులే భారీ మెజారిటీతో విజయ దుందుభి మోగించారు. అనంతరం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ కనీస పోటీ కూడా ఇవ్వలేకపోయింది. తమ కంచుకోటలుగా టీడీపీ నేతలు భావించే ధర్మవరం, పుట్టపర్తి, హిందూపురం, పెనుకొండ మున్సిపాలిటీలు కూడా వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంది.

టీడీపీ దుకాణం బంద్

నాలుగు దశాబ్దాల చరిత్ర ఉన్న టీడీపీ తొలిసారిగా రాజ్యసభలో ఖాళీ అయింది. అదేవిధంగా జిల్లాలో ఒక్క మున్సిపాలిటీలోనూ అధికారం చేపట్టలేకపోయింది. జిల్లాలోని 32 మండల పరిషత్ పదవులు వైఎస్సార్ సీపీ దక్కించుకుంది. ధర్మవరంలో 40 కౌన్సిల్ స్థానాల్లో టీడీపీ కనీసం బోణీ కూడా కొట్టలేకపోయింది. హిందూపురం మున్సిపాలిటీని సైతం టీడీపీ సాధించలేకపోయింది. వార్డు స్థాయి నుంచి రాజ్యసభ వరకు టీడీపీ ఒక్కో స్థానం కోల్పోతూనే ఉంది. దీంతో టీడీపీ వెంట నడిచేందుకు కార్యకర్తలు మొగ్గు చూపడం లేదు. ఒక్కొక్కరుగా వైఎస్సార్‌సీపీలోకి వచ్చి చేరుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఎన్నికలంటేనే టీడీపీ నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

బర్డ్ ఫ్లూపై అప్రమత్తం

- ఉమ్మడి జిల్లాలో 158 ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు



బర్డ్ ఫ్లూ లక్షణాలు కలిగిన కోళ్లు (ఫైల్)

అనంతపురం అగ్రికల్చర్: ప్రమాదకర బర్డ్ ఫ్లూపై అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లాలో ఒక్క కేసు నమోదు కానప్పటికీ ముందస్తు చర్యలు చేపట్టినట్లు పశుసంవర్ధక శాఖ అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల జేడీలు డాక్టర్ వై.సుబ్రమణ్యం, డాక్టర్ బి. శుభదాస్ తెలిపారు. కోళ్లు, బాతులు, నీటి పక్షులు, టర్కీ కోళ్లు, కొంగలు, గిన్ని కోళ్లు, కౌజు పిట్టలు, నెమళ్లు, విదేశీ పక్షుల ద్వారా బర్డ్ ఫ్లూ వ్యాపిస్తుందన్నారు. ఇది కోళ్లకు వ్యాపించే వైరస్ అన్నారు. మనుషులకు కూడా సోకే ప్రమాదం ఉంటుందన్నారు. కోళ్లలో అకస్మాత్తుగా మరణాలు, కళ్లు, తల, మెడ దగ్గర వాపు రావడం, ముక్కు నుంచి ద్రవాలు కారడం, గుడ్ల ఉత్పత్తి తగ్గిపోవడం, అకస్మాత్తుగా మెత్తబడటం, కాళ్లు ఎరుపుగా మారడం లాంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు. కోళ్ల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానం వస్తే పశుశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.

158 ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు

బర్డ్‌ఫ్లూ వ్యాధి నిర్మూలనలో భాగంగా అనంతపురం జిల్లాలో 80, శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో 78 ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. ఇప్పటికే 392 క్లోయకరల్ స్వాబ్స్, 260 రక్తనమూనాలు సేకరించి విజయవాడ పరీక్షా కేంద్రానికి పంపామన్నారు. అలాగే చిలమత్తూరు మండలం ఎస్.వీరాపురంలో విదేశీ పక్షుల నుంచి నమూనాలు తీసి ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. అనంతపురం జిల్లాలో 3.67 లక్షల బాయిలర్ కోళ్లు, 1.76 లక్షల పెరటి కోళ్లు ఉండగా, సత్యసాయి జిల్లాలో 4.46 లక్షల బాయిలర్, 2.64 లక్షల పెరటి కోళ్లు ఉన్నట్లు తెలిపారు. వ్యాధి నివారణకు ప్రజలు, కోళ్ల పెంపకం దారులు సహకరించాలని కోరారు.

దొంగఓట్ల సంస్కృతి టీడీపీదే

- ఇప్పటికే ఏడు వేల ఓట్లు ఎక్కించారు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే కేతిరెడ్డి



దొంగ ఓట్లపై ఆధారాలను కలెక్టర్‌కు అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

పుట్టపర్తి అర్బన్: దొంగఓట్లతో అడ్డదారిలో గెలిచేందుకు టీడీపీ నేతలు కుట్రలు చేస్తున్నారని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఆరోపించారు. సోమవారం కలెక్టర్ అరుణ్‌బాబును ఆయన ఛాంబర్‌లో కలిసిన ఎమ్మెల్యే కేతిరెడ్డి దొంగ ఓట్ల నమోదు, వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఓట్లు తొలగింపుపై కలెక్టర్‌తో చర్చించారు. కొందరు అధికారుల ప్రమేయంతో దొంగ ఓట్ల నమోదుకు టీడీపీ నాయకులు పాల్పడుతున్నారని, ఈ విష సంస్కృతికి ఆదిలోనే చరమగీతం పాడాలని ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. అనంతరం ఎమ్మెల్యే కేతిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నాయకులు దొంగ ఓట్లపైనే ఆధారపడ్డారన్నారు. 2014 ఎన్నికల్లో సైతం కేతిరెడ్డి కాలనీలోని పునాదులకు సైతం ఇంటి నంబర్లు ఇచ్చి సుమారు 14 వేల దొంగ ఓట్లను ఓటరు తుది జాబితా చేర్చారన్నారు. అదే విధంగా ఈఏడాది ఇప్పటి వరకూ 7 వేలకు పైగా ఓట్లను ఎక్కించారన్నారు. నియోజక వర్గంలో ర్యాండంగా పరిశీలించి దొంగ ఓట్లను ఎక్కించిన అధికారిని, ఆన్‌లైన్ చేసిన వ్యక్తిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. గత 45 నెలలుగా జైలులో ఉన్న గొట్లూరుకు చెందిన నారాయణ స్వామి ఓటును తొలగించాలని క్లెయిమ్ చేశారని, ఇది కేవలం ఉదాహరణ మాత్రమేనన్నారు.

భయపెట్టి ఓటీపీ తీసుకుంటున్నారు

ఇటీవల టీడీపీ నాయకులు 'భవిష్యత్తుకు గ్యారెంటీ' పేరుతో ఇంటింటికీ వెళ్లి ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారని ఎమ్మెల్యే కేతిరెడ్డి మండిపడ్డారు. ఓటరు లిస్ట్‌లో ఒక పేజీకి బదులు మరోపేజీ చూపించి 'మీ ఓటు తొలగించారు.. మీకు పథకాలేవీ రావు' అని భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. అలాగే ఓటు నమోదు చేస్తామంటూ వారి సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీ తీసుకుంటున్నారన్నారు. ఈ క్రమంలోనే వైఎస్సార్ సీపీ మద్దతుదారుల ఓట్లు తొలగిస్తున్నారన్నారు. ఇలా జిల్లాలోనే అత్యధికంగా ఓటరు నమోదు, తొలగింపులకు అత్యధికంగా ఫిర్యాదులు ఒక్క ధర్మవరం నియోజక వర్గం నుంచే నమోదయ్యాయన్నారు. ఇక మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో సమావేశంలో కేవలం ఓట్లు సంఖ్య చెప్తున్నారు తప్ప, వివరాలు ఇవ్వడం లేదన్నారు. నమోదుకు ముందే వివరాలు ఇస్తే అవి దొంగవా, కావా అని గుర్తిస్తామన్నారు. ఓటరు జాబితాలో చేర్చిన తర్వాత తొలగించాలంటే అందరికీ ఇబ్బందేనన్నారు. ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్న కొందరు అధికారులు నూతన ఓటరు వివరాలు పరిశీలించకుండా అంగీకరిస్తే దొంగ ఓట్లు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. అలా చేస్తే ప్రజాస్వామ్యానికే ప్రమాదమని ఎమ్మెల్యే కేతిరెడ్డి అన్నారు. అందుకే దొంగ ఓట్ల నమోదుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు.

ఈవీఎం పనితీరు అందరూ తెలుసుకోవాలి

- మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి అర్బన్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం) పనితీరు గురించి అందరూ తెలుసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్ సమీపంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈవీఎం, వీవీప్యాట్, బ్యాలెట్ యూనిట్, పోలింగ్ బూత్ సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకూ ప్రజలు మోడల్ పోలింగ్ స్టేషన్ సందర్శించవచ్చన్నారు. అనుమానాలను నివృత్తి చేసేందుకు అధికారులు కూడా అందుబాటులో ఉంటారన్నారు. ప్రతి ఒక్కరూ మోడల్ పోలింగ్ స్టేషన్ సందర్శించాలన్నారు.

100 శాతం పోలింగ్ కావాలి

రానున్న సార్వత్రి ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా సిద్ధం కావాలన్నారు. ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజక వర్గాలు, రాప్తాడులో మూడు మండలాలు ఉంటాయన్నారు. జిల్లాలో 1,561 పోలింగ్ కేంద్రాలుండగా, ఒక్కో పోలింగ్ కేంద్రంలో పీఓ, ఏపీఓ, ముగ్గురు ఓపీఓలు ఉంటారన్నారు. ఎన్నికల నిర్వహణకోసం 11 వేల మంది సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. 20 శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ విధానం అమలు చేస్తామన్నారు. ఓటర్ల సంఖ్య ఆధారంగా మరిన్ని పోలింగ్ కేంద్రాలు పెరగవచ్చన్నారు. పుట్టపర్తి, ధర్మవరం, కదిరి నియోజక వర్గాల ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని గోరంట్లలోని మాంటిస్సోరి పాఠశాలలో, పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజక వర్గాల ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని లేపాక్షిలోని బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, స్వీప్ జిల్లా అధికారి శివరంగప్రసాద్, ఆర్డీఓ భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.



మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

సంతృప్తికర పరిష్కారం చూపాలి



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

- 'స్పందన' అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం

పుట్టపర్తి అర్బన్: 'స్పందన' కార్యక్రమంలో అందే అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో పాల్గొన్నారు. డీఆర్‌ఓ కొండయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, డీపీఓ విజయ్‌కుమార్ తదితరులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమానికి వివిధ సమస్యలపై మొత్తం 240 అర్జీలు అందగా, వాటి పరిష్కారానికి ఆయా శాఖలకు పంపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలను పరిష్కరించడంలో అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. సమస్యలను క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలిస్తే శాశ్వత పరిష్కారం చూపవచ్చన్నారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వే కార్యక్రమంపై అధికారులు, వలంటీర్లు శ్రద్ధ చూపాలన్నారు.

ప్రభుత్వ భవనాలు అందుబాటులోకి తేవాలి

రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు సంబంధించిన 188 భవనాలు పూర్తయ్యాయని కలెక్టర్ తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకుని ఈనెల 29న ఎమ్మెల్యేల అనుమతితో పండుగ వాతావరణంలో భవనాలను ప్రారంభించాలని అధికారులకు సూచించారు.

మార్చి 18 నుంచి పది పరీక్షలు

మార్చి 18వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానుండగా, జిల్లా నుంచి 27,555 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వీరి కోసం జిల్లా వ్యాప్తంగా 115 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకూ పరీక్షలు ఉంటాయన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా కేంద్రాల వద్ద చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద మెడికల్ బృందాలు ఏర్పాటు చేయాలని, నిరంతర విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే జిల్లాకు చెందిన 2,351 మంది విద్యార్థులు ఓపెన్ ఇంటర్, పది పరీక్షలు రాయనుండగా, వారి కోసం 11 కేంద్రాల్లో ఏర్పాటు చేశామన్నారు. ఓపెన్ విద్యార్థులకు మధ్యాహ్నం పరీక్ష ఉంటుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి, డీఈఓ మీనాక్షి, డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్, డీసీఓ కృష్ణానాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రషీద్‌ఖాన్, పట్టు శాఖ అధికారి పద్మమ్మ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణన్, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, స్వీప్ అధికారి శివరంగప్రసాద్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, సీపీఓ విజయ్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు మంచి రోజులు

- జగనన్న పాలవెల్లువతో పెరగనున్న ధరలు
- అన్‌లైజర్లకు లైసెన్సులు తప్పనిసరి
- మిల్క్ ఇన్‌స్పెక్టర్లుగా వ్యవహరించనున్న పశువైద్యాధికారులు
- పాల నాణ్యతను బట్టి పాడి రైతులకు గిట్టుబాటు ధర





అనంతపురం అగ్రికల్చర్: పాడి రైతులకు మంచి రోజులు వస్తున్నాయి. పాడి రైతులకు దన్నుగా నిలిచేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. పాడి పశువులు, గేదెల పోషణ ద్వారా జీవనం సాగిస్తున్న వారికి మంచి ధర చెల్లించేందుకు జగన్ సర్కార్ నిర్ణయం తీసుకుంది.

ప్రైవేట్ డెయిరీల దోపిడీకి చెక్

అమూల్ లాంటి అంతర్జాతీయ పాడి సహకార సంస్థతో జగన్ సర్కార్ చేసుకున్న ఒప్పందం తర్వాత ప్రైవేట్ డెయిరీలో దోపిడీకి చెక్ పడింది. గత కొన్నేళ్లుగా ప్రైవేట్ డెయిరీలు చెప్పిందే ధరగా కొనసాగుతూ వచ్చింది. ఇష్టారాజ్యంగా పాడి రైతులను మోసం చేస్తూ తక్కువ ధరకే పాలను కొనుగోలు చేస్తూ వచ్చారు. అమూల్ ప్రవేశంతో ప్రైవేట్ డెయిరీల నిర్వాహకులు సైతం ధరలు పెంచకతప్పలేదు. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా జగన్ సర్కార్ తమకెంతో మేలు చేసిందని పాడి రైతులు అంటున్నారు. శ్రీసత్యసాయి జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రెండేళ్లుగా జగనన్న పాల వెల్లువ విజయవంతంగా అమలవుతోంది. తాజా అనంతపురం జిల్లా పరిధిలో నాలుగైదు రోజుల్లో పాల సేకరణ ప్రక్రియ ప్రారంభించనున్నారు. ఐదు మండలాల్లోని 98 గ్రామాల్లో 55 ఆర్‌బీకేల ద్వారా పాల సేకరణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

రైతుల సంక్షేమం కోసమే మిల్క్ యాక్ట్

తాజాగా రైతుల సంక్షేమం కోసం పాల రక్షిత ప్రమాణముల అమలు చట్టాన్ని (మిల్క్‌యాక్ట్) రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీనిపై పశుసంవర్ధకశాఖ అధికారులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. చాలా కేంద్రాల్లో మిల్క్ అనలైజర్లు ఉన్నా అందులో మోసం చేయడానికి అవకాశం ఉందని గుర్తించారు. దీంతో పాడి రైతులకు సరైన ధర లభించడం లేదనే వాదనలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడంలో భాగంగా ఇకపై మిల్క్ ఇన్‌స్పెక్టర్లుగా పశువైద్యులు (వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్–వీఏఎస్) వ్యవహరించనున్నారు. చట్టాన్ని పారదర్శకంగా అమలు చేయడంలో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న పాల సేకరణ కేంద్రాలు (మిల్క్ ప్రొక్యూర్‌మెంట్ సెంటర్లు) తప్పనిసరిగా లైసెన్సులు తీసుకోవాలి. అనంతరం వీటిని ఏటా రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం మిల్క్ అనలైజర్ మిషన్ వాడుతున్న ప్రతి ఒక్కరూ రూ.1,500 చెల్లించి లైసెన్సు తీసుకుని కేంద్రాల్లో డిస్‌ప్లే చేయాలంటూ స్పష్టమైన ఆదేశాలూ జారీ అయ్యాయి. తనిఖీ సమయంలో లైసెన్సు లేకుంటే మొదటి దఫా కింద రూ.50 వేలు జరిమానా విధిస్తారు. రెండో సారి పట్టుబడితే రూ.లక్ష జరిమానా, ఆరు నెలల వరకు జైలు శిక్ష పడే అవకాశముంది. మిల్క్ ఇన్‌స్పెక్టర్లు తరచూ పాల సేకరణ కేంద్రాలను తనిఖీ చేసి అనలైజర్లు కచ్చితత్వంతో పనిచేస్తున్నాయా లేదా అనేది చూడాల్సి ఉంటుంది.

> **నాణ్యతను బట్టి ధర**
>
> పాల నాణ్యతను బట్టి అంటే కొవ్వుశాతం (ఫ్యాట్), ఘన పదార్థం (ఎస్‌ఎన్‌ఎఫ్) ఆధారంగా గేదె పాలు లీటర్‌కు రూ.45 నుంచి రూ. 87 వరకు, ఆవు పాలకు రూ.35 నుంచి రూ.45 వరకు ధర చెల్లిస్తారు. తర్వాత పాడి రైతులకు మంచి ధరతో పాటు వినియోగదారులకు నాణ్యమైన పాలు, వాటి ఉత్పత్తులను చేరువ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనలైజర్లను వాడుతున్న వారు విధిగా ఆర్‌బీకేలు, పశువుల ఆస్పత్రి వైద్యాధికారులను సంప్రదించి లైసెన్సులు పొందాలి.
>
> – డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, జాయింట్ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ

క్లుప్తంగా

ఎస్టీయూ రాష్ట్ర కమిటీలో జిల్లా వాసులకు చోటు



నియామక పత్రాలు అందజేస్తున్న రాష్ట్ర నాయకులు

పుట్టపర్తి టౌన్: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర కమిటీలో జిల్లా నుంచి ఇద్దరికి చోటు దక్కింది. రెండు రోజుల కిందట పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఎస్టీయూ 77వ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శిగా హిందూపురానికి చెందిన శ్రీనివాసులు, ఆర్థిక వ్యవహారాల కమిటీ సభ్యుడిగా కదిరికి చెందిన రామమోహన్ ఎన్నికయ్యారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 44 మంది విద్యార్థుల ఎంపిక

అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 22 మంది విద్యార్థులకు ఉద్యోగాలు దక్కాయి. ఈ నెల 16 నుంచి క్యాంపస్ ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి. ఆస్ట్రాజన్ కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూలకు 54 మంది అభ్యర్థులు హాజరు కాగా, 22 మంది ఎంపికయ్యారు. అలాగే డేటా మార్షల్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 82 మంది పాల్గొనగా 22 మందికి ఉద్యోగాలు దక్కాయి. ఉద్యోగాలు దక్కించుకున్న విద్యార్థులను ఈ సందర్భంగా సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ వీసీ ప్రొఫెసర్ ఎస్.ఏ కోరి అభినందించారు.

25న కవితాయాత్ర

పెనుకొండ: ఈ నెల 25న పెనుకొండలో కవితా యాత్ర కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు పట్టణానికి చెందిన ప్రముఖ కవి జాబిలి చాంద్ బాషా సోమవారం వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా 60 మంది లబ్ధప్రతిష్టులైన కవులతో కవితా గానం ఉంటుందన్నారు. శ్రీకృష్ణదేవరాయల సాహితీ వైభవాన్ని, ఆయన గొప్పదనాన్ని, కీర్తిప్రతిష్టలను తలపింపజేసేలా ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య

నల్లమాడ: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఓబుళదేవరచెరువు మండలం కొండకమర్ల గ్రామానికి చెందిన ఎస్.మహబూబ్‌బాషా కుమారుడు ఎస్.బాబాఫక్రుద్దీన్ (24) కొంత కాలంగా థైరాయిడ్‌తో పాటు మానసిక సమస్యలతో బాధపడుతున్నాడు. దీనికి తోడు పెళ్లి కాలేదు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి పెంచుకున్న బాబాఫక్రుద్దీన్ సోమవారం ఉదయం నల్లమాడ మండలం చౌటకుంటపల్లి సమీపంలోని మామిడి తోటలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ సురేంద్ర అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జగనన్న సందేశం ప్రజల్లోకి తీసుకెళ్దాం

- 'సిద్ధం' విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు
- ఉమ్మడి జిల్లాలో 2 ఎంపీ, 14 ఎమ్మెల్యే స్థానాల్లో గెలుపు వైఎస్సార్‌సీపీదే
- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: రాప్తాడులో ఆదివారం జరిగిన సిద్ధం సభలో సీఎం జగనన్న ఇచ్చిన సందేశాన్ని సమష్టిగా ప్రజల్లోకి తీసుకెళదామని పార్టీ శ్రేణులకు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం అనంతపురంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ స్థాయి 'సిద్ధం' సభను రాప్తాడులో నిర్వహించేందుకు అనుమతిచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సిద్ధం సభకు వచ్చిన కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నీ తానై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఏర్పాట్లు చేశారని తెలిపారు. ఈ తరహా ఎన్నికల సభను దేశ రాజకీయ చరిత్రలో ఏ పార్టీ ఎన్నడూ నిర్వహించలేదన్నారు. సిద్ధం సభ నిర్వహణకు స్థలాన్ని కేటాయించిన దాతలకు, జన సునామీలా తరలివచ్చిన జగనన్న సైనికులకు, సభా ప్రాంగణాన్ని జనసంద్రంగా మార్చిన రాయలసీమ బిడ్డలందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. పెత్తందారులతో పోరాడే క్రమంలో జగన్ వెంటే తాము ఉండేందుకు సిద్ధమని ఈ సభ ద్వారా కార్యకర్తలు నినదించారన్నారు. ఈ క్రమంలో జగనన్న సందేశాన్ని రామనామంలో భావించి ప్రతి ఇంటికీ చేరువ చేయాల్సిన బాధ్యత కార్యకర్తలందరిపై ఉందన్నారు. ఐదేళ్లలో పేదలకు చేసిన ప్రతి మంచి పనిపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా నాయకులు, మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్లు, మేయర్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, జెడ్పీ చైర్మన్లు, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్లు, ఇతర ప్రతినిధుల అందరికీ పేరుపేరునా రాప్తాడు నియోజకవర్గం తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు ఎంపీలు, 14 ఎమ్మెల్యే స్థానాలు గెలవబోతున్నామన్నారు. ప్రజాస్వామ్యంలో పత్రికలకు స్వేచ్ఛ ఉంటుందని, వారు రాసే విషయాల్లో ఏవైనా అవాస్తవాలు, బాధ కలిగించే అంశాలున్నప్పుడు దానిపై స్పష్టత ఇవ్వాల్సిన స్వేచ్ఛ మనకూ ఉంటుందన్నారు. అంతేకాని చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదన్నారు. రాప్తాడులో ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడిని ఖండించారు. బాధితుడికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. జర్నలిస్టులకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో అనంతపురం రూరల్ జెడ్పీటీసీ చంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు ధనుంజయ యాదవ్, రాప్తాడు వైస్ఎంపీపీ రామాంజనేయులు, నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

'పోలీసు స్పందన'కు 33 వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 33 వినతులు అందాయి. ఎస్పీ మాధవరెడ్డి స్వయంగా బాధితుల నుంచి వినతులు స్వీకరించి, సమస్య తీవ్రతను అడిగి తెలుసుకున్నారు. చట్టపరిధిలోని సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ పీఐ శ్రీహర్ష, దిశ డీఎస్పీ శ్రీనివాసరావుతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంలో నిప్పు



మంటలు ఆర్పుతున్న దృశ్యం

తాడిమర్రి: మండల పరిధిలోని చిల్లవారిపల్లి సమీపంలో ఉన్న రిజర్వు ఫారెస్టులో సోమవారం సాయంత్రం 4.30 గంటలకు కొందరు దుండగులు నిప్పు రాజేశారు. శాటిలైట్ ద్వారా ఈ దృశ్యాలను కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని డెహ్రాడూన్ అటవీశాఖ కార్యాయం అధికారులు గుర్తించి, వెంటనే అప్రమత్తం చేయడంతో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సూర్యనారాయణ, వీఎస్ఎస్ చైర్మన్ గంటా వెంకట్రాముడు, నార్పల మండలం నడిమిపల్లికి చెందిన గొర్రెల కాపరి రాజేష్ తదితరులు చిల్లవారిపల్లి, కునుకుంట్ల గ్రామాల మధ్య కొండలపై చెలరేగుతున్న మంటలను ఆర్పేందుకు మూడున్నర గంటల పాటు శ్రమించారు. ఎఫ్‌బీఓ సూర్యనారాయణ మాట్లాడుతూ... అడవులకు నిప్పు పెట్టడంతో పశుగ్రాసం, విలువైన చెట్లు, ఔషధ మొక్కలు కాలిపోతాయన్నారు. ఫలితంగా జీవాలు, పశువులకు గ్రాసం లేకుండా పోతుందని, వన్యజీవులూ మృతి చెందుతాయన్నారు. విలువైన అటవీ ఉత్పత్తులు కోల్పోవాల్సి వస్తుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



వెన్నెల (ఫైల్)

చిలమత్తూరు: కర్ణాటకలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... బెంగళూరులో నివాసముంటున్న చిలమత్తూరు మండలం పాత చామలపల్లికి చెందిన వెన్నెల (35) తన ఐదేళ్ల వయసున్న కుమార్తెతో కలసి ఇటీవల స్వగ్రామానికి వచ్చారు. పెళ్లి వేడుకలో పాల్గొన్న ఆమె సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు టాటా సఫారీ వాహనంలో బెంగళూరుకు తిరుగు ప్రయాణమయ్యారు. కర్ణాటకలోని బాగేపల్లి సమీపంలో చేరుకోగానే గ్రీన్‌పార్క్ ధాబా వద్ద 44వ జాతీయ రహదారికి వెళ్లే మలుపులో వేగంగా దూసుకొచ్చిన లారీ ఢీకొనడంతో వెన్నల అక్కడికక్కడే మృతి చెందారు. చిన్నారి తీవ్రంగా గాయపడింది. మరో ఐదుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న బాగేపల్లి పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

యువకుడిని కాపాడిన పోలీసులు



ప్రవీణ్‌రెడ్డిని కాపాడి తీసుకువస్తున్న పోలీసులు

సోమందేపల్లి: ఆత్మహత్యకు సిద్ధపడిన యువకుడిని పోలీసులు సకాలంలో గుర్తించి కాపాడారు. వివరాలు... సోమందేపల్లిలోని గీతానగర్‌కు చెందిన ప్రవీణ్‌రెడ్డి... డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన ఆయన సోమవారం రాత్రి చాకర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద పట్టాలపై పడుకుని తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు వాట్సాప్ ద్వారా కుటుంబసభ్యులతో మాట్లాడాడు. కుటుంబసభ్యులు వెంటనే డయల్ 100కు సమాచారం అందజేయడంతో విషయం తెలుసుకున్న ఎస్ఐ విజయ్ కుమార్ వెంటనే స్పందించి కానిస్టేబుళ్లను అక్కడకు పంపారు. అప్పటికే రైలు వస్తుండడం గమనించిన వారు పట్టాలపై పడుకుని ఉన్న ప్రవీణ్‌రెడ్డిని పక్కకు లాగి ప్రాణాలు కాపాడి స్టేషన్‌కు తరలించారు. కౌన్సెలింగ్ అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

వ్యక్తి బలవన్మరణం

ముదిగుబ్బ: మండలంలోని రాళ్లనంతపురం గ్రామానికి చెందిన హనుమంతరెడ్డి (40) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న హనుమంతరెడ్డికి భార్య అనిత, ఓ కుమారుడు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

సింహ వాహనంపై పేట వేంకటరమణుడు

హిందూపురం: స్థానిక పేట వేంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం దేవేరులతో కలసి సింహ వాహనంపై భక్తులకు శ్రీవారు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో విశేష పూజలు, ప్రత్యేక అలంకరణలు జరిగాయి. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణ స్వామి ఉత్సవ మూర్తులను సింహ వాహనంపై కొలువుదీర్చి నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భగీరథ నవీన్, ఈఓ నరసింహమూర్తి, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

అనంతపురం సిటీ: మద్యానికి బానిసైన వ్యక్తి కుటుంబసభ్యులతో గొడవపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని రాణినగర్‌కు చెందిన షేక్ మహబూబ్ బాషా (40) మెకానిక్‌గా జీవనం సాగిస్తున్నాడు. భార్య రేష్మా, ఓ కుమార్తె ఉన్నారు. కొంత కాలంగా తాగుడుకు బానిసైన ఆయన తరచూ మద్యం మత్తులో ఇంటికి చేరుకుని కుటుంబసభ్యులతో గొడవపడేవాడు. ఈ క్రమంలోనే భార్యాపిల్లలను విచక్షణారహితంగా చితకబాదేవాడు. శనివారం ఉదయం ఇంట్లో గొడవపడి బయటకు వచ్చేసిన మహబూబ్‌బాషా సోమవారం ఉదయం అనంతపురం రైల్వే స్టేషన్‌కు సమీపంలోని హెచ్చెల్సీ వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ విజయ్‌కుమార్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఏపీ ప్రకృతి వ్యవసాయంపై ప్రశంసలు

- స్విట్జర్లాండ్ పర్యటనలో డీపీఎం లక్ష్మానాయక్



స్విట్జర్లాండ్‌లో విదేశీ శాస్త్రవేత్తల బృందంతో డీపీఎం లక్ష్మానాయక్

పుట్టపర్తి అర్బన్: ఏపీ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలపై విదేశీ శాస్త్రవేత్తల నుంచి ప్రశంసలు వ్యక్తమయ్యాయని ఏపీ ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్‌ఎఫ్) జిల్లా డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ (డీపీఎం) లక్ష్మానాయక్ అన్నారు. ఈ నెల 13 నుంచి విదేశీ పర్యటనలో భాగంగా చివరి రోజు సోమవారం ఆయన స్విట్జర్లాండ్ నుంచి 'సాక్షి'తో మాట్లాడారు. ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఆర్గనైజింగ్ ఫార్మింగ్ సదస్సులో విదేశాలకు చెందిన పలువురు శాస్త్రవేత్తలు పాల్గొన్నట్లు తెలిపారు. ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం గురించి ప్రశంసలు గుప్పించారన్నారు. పరిశోధనలు, మెలకువలకు ఏపీ అనువైన ప్రాంతమని వారు గుర్తించినట్లు తెలిపారు. త్వరలోనే వివిధ దేశాల ప్రతినిధులు ఏపీ, అనంతపురం పర్యటనకు వచ్చే అవకాశం ఉందన్నారు.

బాధ్యతతో పనిచేయండి

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 17 మందికి కారుణ్య నియామకాలు



నియామకపత్రాలు అందుకున్న వారితో గిరిజమ్మ, జెడ్పీ సీఈఓ నిధియాదేవి

అనంతపురం సిటీ: ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. ఉమ్మడి జిల్లాలో జెడ్పీ, అనుబంధ విభాగాల్లో పని చేస్తూ మరణించిన 17 మంది ఉద్యోగులకు సంబంధించి వారి వారసులకు కారుణ్య నియామకాల కింద టైపిస్టులుగా ఉద్యోగావకాశం కల్పించారు. ఎంపికైన వారికి జెడ్పీ సీఈఓ వైభోమ్ నిదియాదేవి, డిప్యూటీ సీఈఓ లలితాబాయి, జెడ్పీ ఉద్యోగ సంఘం ప్రతినిధి నాగేంద్రకుమార్‌తో కలసి సోమవారం సాయంత్రం తన చాంబర్‌లో ఆమె నియామక పత్రాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఈ నాలుగున్నరేళ్ల జగనన్న పాలనలో అర్హులైన వారందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు దక్కాయన్నారు. నియామక పత్రాలు అందుకున్న వారందరికీ సీఈఓ నిదియాదేవి శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరిస్తాం

- ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి



వినతిపత్రం అందుకుంటున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన సోమవారం ఎస్కేయూ, జేఎన్‌టీయూ(ఏ)ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన దృష్టికి ఆయా వర్సిటీల్లోని బోధనేతర సిబ్బంది, ఉద్యోగులు తీసుకువచ్చారు. తక్షణమే స్పందించిన ఆయా వర్సిటీల వైస్‌చాన్సలర్లు, రిజిస్ట్రార్లతో కలిసి చర్చించారు. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మిని కలసి మాట్లాడారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి సహకరించాలన్నారు. ఆయన వెంట జిల్లా ఉపాధ్యాయ జేఏసీ నాయకులు అశోక్‌కుమార్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, గోవిందరెడ్డి, రవీంద్రారెడ్డి, తిమ్మారెడ్డి, జగన్, రవి, కృష్ణారెడ్డి, నాగేంద్ర గౌడ్, 'అపుస్మా' నాయకులు కుసుమ పుల్లారెడ్డి, సుబ్బారెడ్డి, మధు తదితరులు ఉన్నారు.

అభ్యుదయ కవితలకు ఆహ్వానం

అనంతపురం కల్చరల్: ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కవితా సంకలనం చేపట్టనున్నారు. ఇందుకోసం ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉండే కవుల నుంచి అభ్యుదయ కవితలను ఆహ్వానిస్తున్నట్లు జిరసం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆధునిక దృక్పథంతో వచ్చే కవితలకు ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 29వ తేదీలోపు కవులు తమ కవితలను 7702291125 వాట్సాప్ నంబర్‌కు పంపాలని సూచించారు.